సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 19 । నవంబర్ । 2024



డ్వాక్రా సొమ్ము స్వాహా!

నకిలీ తీర్మానాలు.. ఫోర్జరీ సంతకాలతో ఓ విలేజ్ బుక్ కీపర్ బ్యాంక్‌కే టోకరా వేసింది. డ్వాక్రా సొమ్ము కాజేసింది. 8లో▸



గ్రూప్–3 ప్రశాంతం

గ్రూప్–3 పరీక్ష రెండో రోజు సోమవారం ప్రశాంతంగా జరిగింది. అభ్యర్థులు తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. 8లో▸



రైతు సంక్షేమమే లక్ష్యం

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ప్రజావాణి అర్జీలకు తక్షణం పరిష్కారం చూపాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: వివిధ ప్రాంతాల నుంచి ప్రజావాణికి వచ్చే వినతులపై సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చే అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించేలా చూడాలని సూచించారు. ఈ వారం వివిధ అంశాలపై 41 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇందులో రెవెన్యూకూ సంబంధించి 36, ఇతర శాఖలకు సంబంధించి 5 అర్జీలు అందాయని చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్‌లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

డిగ్రీ స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఐఎంఎస్‌సీ డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా సో మవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐఎంఎస్‌సీలో అడ్మిషన్ పొందేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థినులు ఇంటర్‌లో ఎంపీసీ, బీపీసీలో 55 శాతం మార్కులు సాధించి ఉండాలని సూచించారు. ఐఎంఎస్‌సీ డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందితే ఆ విద్యార్థిని డిగ్రీ, పీజీ పూర్తి చేసుకుంటారని తెలిపారు. అడ్మిషన్ పొందాలనేకునే విద్యార్థినులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 18 నుంచి 28 వరకు కళాశాలలో నేరుగా సంప్రదించాలని కోరారు. మ రిన్ని వివరాలకు 89789 42246, 95730 2 1 035 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

త్వరలో బీజాపూర్ రహదారి విస్తరణ పనులు

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి



అధికారులు, నాయకులతో సమావేశమైన ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి

చేవెళ్ల/మొయినాబాద్: అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. నగరంలోని తన నివాసంలో సోమవారం బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనుల పురోగతిపై ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ నాగేశ్వరరావు, ఆర్ అండ్ బీ ఈఈ ధర్మారెడ్డి, ఇతర అధికారులు, చేవెళ్ల ప్రాంత బీజేపీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రోడ్డు విస్తరణ పనుల ఆలస్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలస్యం చేయకుండా త్వరగా పనులు ప్రారంభించి రోడ్డు ప్రమాదాల బారి నుంచి ప్రజలను కాపాడాలని అధికారులకు సూచించారు. రెండు వారాల్లో పనులు ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన రోడ్డు విస్తరణ పనులు చేపడతామని అధికారులు తెలిపారు. చేవెళ్ల బైపాస్ వద్ద ఉన్న శ్మశానవాటిక దగ్గర అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని చేవెళ్ల గ్రామస్తులు ఎంపీకి వినతిపత్రం అందజేశారు. సమావేశంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు రాందేవ్‌రెడ్డి, రమణారెడ్డి, మాణిక్యరెడ్డి, జ్ఞానేశ్వర్, వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కిరణ్‌కుమార్, వైభవ్‌రెడ్డి, నాగరాజు, రాజీవ్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

భూములిచ్చేది లేదు

ఫ్యూచర్ సిటీ రహదారి భూ బాధితుల తీర్మానం

- భూమికి భూమి ఇచ్చి తీరాల్సిందే
- లేదంటే మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలి
- తేల్చి చెప్పిన రైతులు



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న రైతులు

కందుకూరు: ఫ్యూచర్ సిటీ రహదారి నిర్మాణం కోసం భూములు ఇచ్చేది లేదని బాధిత రైతులు తేల్చి చెప్పారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డి, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రాలు అందించారు. అంతకు ముందు రాచలూరులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భూములు కోల్పోతున్న వారందరినీ ఒప్పించిన తర్వాతే భూసేకరణ చేపట్టాలని తీర్మానించారు. కందుకూరు, యాచారం, కడ్తాల్ మండలాల్లో గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో ప్రస్తుత ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ నిర్మించడానికి సిద్ధమైంది. అందుకు సంబంధించి ఓఆర్ఆర్ 13 ఎగ్జిట్ నుంచి బేగరికంచె పరిధిలో నిర్మిస్తున్న స్కిల్స్ యూనివర్సిటీ వరకు తొలి విడతలో 300 అడుగుల రహదారి నిర్మించడానికి భూసేకరణ చేపట్టింది. ఇటీవల గ్రామాలు, సర్వే నంబర్ల వారీగా ఏయే భూముల నుంచి ఎంత మేర సేకరించనుందో ప్రకటించింది. రెండు రోజులుగా రెవెన్యూ అధికారులు ఆయా భూముల్లో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. పనులు చేస్తున్న అధికారులను ఇటీవల రాచులూరు రెవెన్యూలో రైతులు అడ్డుకున్న విషయం విధితమే.

నష్టపోకుండా చూడాలి

శ్రీశైలం రహదారిని విస్తరించి గతంలో కొత్తూరు గేట్ నుంచి నిర్మించిన 200 అడుగుల రహదారిని ఉపయోగించుకోవచ్చని సూచించారు. దీంతో తాము భూములు కోల్పోవాల్సిన అవసరం ఉండదని తెలిపారు. కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం రైతులంతా నష్టపోకుండా ప్రభుత్వం ఆలోచించాలన్నారు. తమ పొలాలు ఇవ్వడానికి ఎవరూ సుముఖంగా లేరని స్పష్టం చేశారు. భూమికి భూమి లేదంటే ప్రస్తుతం మార్కెట్‌లో ఎకరం రూ.4కోట్ల నుంచి రూ.5 కోట్లు ధర పలుకుతోందని.. దాని ప్రకారం పరిహారమా అనేది రైతులను ఒప్పించి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తెలియకుండానే సర్వే



మేము ముగ్గురు అన్నదమ్ములం. మాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. ఆ భూమిపైనే ఆధారపడి జీవిస్తున్నాం. అందులో ఎకరం అమ్మి ఆడపిల్లల పెళ్లిళ్లు చేద్దామనుకున్నాం. ఇప్పుడు ఫ్యూచర్ సిటీ రహదారిలో మా భూమి అంతా పోతుంది. మాకు తెలియకుండానే మా భూమిలో సర్వే చేశారు. ఎట్టి పరిస్థితుల్లో భూమి ఇచ్చేది లేదు.

– వట్నాల రఘుపతి, రైతు, రాచులూరు

రెండున్నర ఎకరాలు పోతుంది



మా అమ్మగారి పేరుతో ఉన్న రెండున్నర ఎకరాల భూమి ఫ్యూచర్ సిటీ రహదారి నిర్మాణంలో పోతుంది. 300 అడుగుల రహదారికి బదులు 150 అడుగుల రహదారి నిర్మిస్తే మా భూమి కొంతైనా మిగులుతుంది. బహిరంగ మార్కెట్ ప్రకారం ఎకరానికి రూ.5 కోట్ల చొప్పున చెల్లిస్తే మా భూమి ఇస్తాం. లేదంటే అంగీకరించేది లేదు.

– ధనుంజయ్‌గౌడ్, రైతు, రాచులూరు

భూమికి భూమి కావాలి



మాకు ఎకరం భూమి ఉంది. అధికారులు మార్కింగ్ చేసిన ప్రకారం అది కాస్తా ఫ్యూచర్ సిటీ రోడ్డు నిర్మాణంలో పోతుంది. ఎక్కడా లేని విధంగా 300 అడుగుల రహదారి ఎందుకు నిర్మిస్తున్నారో అర్థం కావడం లేదు. మాకు కచ్చితంగా భూమికి భూమి ఇవ్వాల్సిందే. లేకపోతే భూమి ఇచ్చేది లేదు.

– యాదయ్య, రైతు, రాచులూరు



సమావేశంలో మాట్లాడుతున్న చింతల రామచంద్రా రెడ్డి

రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్

- హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- జనం దృష్టిని మళ్లించేందుకు సీఎం డ్రామాలు
- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రా రెడ్డి

తుర్కయంజాల్: రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెరలేపాడని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి విమర్శించారు. తుర్కయంజాల్ మున్సిపల్ పరిధి మన్నెగూడలోని వేద కన్వెన్షన్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని.. 11 నెలలు గడుస్తున్నా ఏ ఒక్కటీ నెరవేర్చలేదని అన్నారు. హామీల అమలు గురించి బీజేపీ ప్రశ్నిస్తుండటంతో సీఎం హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని దుయ్యబట్టారు. తాజాగా లగచర్ల ఘటన కూడా ఇందులో భాగమేనని అన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డీఎన్ఏ తెలంగాణది కాదని విమర్శిస్తున్న సీఎం రేవంత్ రెడ్డిది టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే డీఎన్ఏలలో ఏదో చెప్పాలని ప్రశ్నించారు. ఇటీవల బీజేపీకి చెందిన 20 మంది నాయకులు మూసీ పరీవాహక ప్రాంతంలోని ప్రజలతో కలిసి నిద్ర చేశామని.. స్వయంగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఆ ప్రాంత ప్రజలతో చర్చించకుండానే ఏకపక్షంగా మూసీ పునరుజ్జీవం పేరిట పేదల ఇళ్లను కూలగొట్టే కార్యక్రమానికి తెరలేపారని మండిపడ్డారు. 1000 అడుగుల విస్తీర్ణంలో ఉన్న మూసీ నదిలో 300 ఫీట్ల వెడల్పుతో రిటైనింగ్ వాల్ కట్టి సమస్యకు పరిష్కారం చూపొచ్చని, మిగిలిన దాంట్లో బ్యూటిఫికేషన్ వంటి పనులు చేపట్టుకోవచ్చని సూచించారు. గంగా నది ప్రక్షాళనకు రూ.38వేల కోట్లను ఖర్చు చేశారని కేవలం 52 కిలో మీటర్ల మూసీ నది కోసం రూ.1.50 లక్షల కోట్లు ఎలా అవుతుందని నిలదీశారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీకి మూటలను పంపించేందుకే ఈ వ్యవహారం అని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఎయిర్‌పోర్టులు, రైల్వే స్టేషన్‌లు, జాతీయ రహదారుల నిర్మాణం శరవేగంగా చేపడుతోందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు విమర్శలు మానుకుని, క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు రాణి రుద్రమ, బండారు విజయలక్ష్మి, సుభాష్, సునీతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25లోగా పాలపిట్ట ఎస్టీపీ సిద్ధం

సాక్షి, సిటీబ్యూరో: వందశాతం మురుగు శుద్ధి కోసం ఎస్టీపీల ప్రాజెక్టు ప్యాకేజీ–3లో భాగంగా నిర్మిస్తున్న పాలపిట్ట ఎస్టీపీ నిర్మాణ పనులు పూర్తి చేసి ఈ నెల 25లోగా ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి పాలపిట్ట నిర్మాణ పనులపై సమీక్షించారు. సివిల్ పనులు పూర్తయ్యాయని, మిగిలిన ఎలక్ట్రో మెకానికల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పనుల వేగవంతానికి కార్మికుల సంఖ్యను రెట్టింపు చేయాలని చెప్పారు. పనులు జరిగేటప్పుడు రక్షణ చర్యలు పాటించాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

తీరు మారాల్సిందే..

- వేళకు రాని అధికారులపై కలెక్టర్ సీరియస్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'కొంత మంది జిల్లా స్థాయి అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజావాణి సహా ఇతర సమీక్ష సమావేశాలను లైట్ తీసుకుంటున్నారు. ఫీల్డ్ విజిట్‌లో ఉన్నట్లు పేర్కొంటూ సమావేశాలకు కిందిస్థాయి అధికారులను పంపుతున్నారు. ఇలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోను' అని కలెక్టర్ సి.నారాయణరెడ్డి హెచ్చరించారు. కలెక్టరేట్ వేదికగా సోమవారం ప్రజావాణి నిర్వహించారు. కొంత మంది అధికారులు ఉదయం 11 దాటినా హాజరు కాకపోవడాన్ని ఆయన తీవ్రంగా పరిగణించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించే కార్యక్రమానికి జిల్లా అధికారులు గైర్హాజరవుతుండటం, కిందిస్థాయి అధికారులను పంపుతుండటం, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఆ వెంటనే ఇదే అంశంపై జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతా సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ఆదేశాలను ధిక్కరించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. సమన్వయంతో పని చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, రాష్ట్రంలోనే జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టాలని సూచించారు. ప్రతి పనిలోనూ అంకిత భావం, నిరుపేదలకు సహాయం చేసి ఉద్యోగ ధర్మాన్ని నెరవేర్చుకోవాలన్నారు. వారంలో మూడు రోజులు ఫీల్డ్‌లో ఉండాలని, కిందిస్థాయి అధికారుల పనితీరును పరిశీలించి, వారికి తగు సూచనలు ఇవ్వాలని అన్నారు. నిబంధనల మేరకు పని చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్ఓ సంగీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మీటర్‌కు షాక్.. రీడింగ్‌కు బ్రేక్!

గ్రేటర్‌లో నెలకు సగటున 20 వేల విద్యుత్ మీటర్లకు రిపేర్లు.. 4,620 మీటర్లు దగ్ధం

- గడువు ముగియక ముందే కాలిపోతున్న వైనం
- యావరేజ్ బిల్లింగ్‌తో నష్టపోతున్న వినియోగదారులు


సాక్షి, రంగారెడ్డి జిల్లా: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)లో విద్యుత్ మీటర్ల పనితీరు ప్రశ్నార్థకంగా మారింది. లూజ్ కాంటాక్ట్, ఎర్తింగ్ నిర్వహణ లోపం, విద్యుత్ పంపిణీలో హెచ్చుతగ్గులు మీటర్ల పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నెలకు సగటున 20 వేల మీటర్లు స్టకప్ (రీడింగ్ నమోదు ఆగిపోవడం) అవుతుండగా, సుమారు 4,620 మీటర్లు దగ్ధం అవుతుండటంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. తరచూ మీటర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటం, సిబ్బంది కూడా ఇష్టారాజ్యంగా విద్యుత్ బిల్లులు జారీ చేస్తుండటంతో వినియోగదారులు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే ప్రతి యూనిట్‌కు పక్కాగా లెక్క కట్టాలని భావించిన డిస్కం మాన్యువల్ మీటర్ల స్థానంలో ఎలక్ట్రానిక్ తర్వాత డిజిటల్ మీటర్లంటూ ఎప్పటికప్పుడు మారుస్తోంది. నాణ్యతకు పెద్దపీట వేయాల్సిన అధికారులు పలు మీటర్ల తయారీ కంపెనీలతో కుమ్మక్కై నాసిరకం మీటర్లను కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

కనెక్షన్ల సంఖ్య కన్నా ఎక్కువ కొనుగోలు

హెచ్‌పీఎల్ ఎలక్ట్రానిక్ అండ్ పవర్ లిమిటెడ్, హిమాచల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, జెనిసస్ పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సైనా పవర్ లిమిటెడ్, అవాన్ మీటర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ల నుంచి ప్రస్తుత కనెక్షన్ల కంటే ఎక్కువ మీటర్లు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా హెచ్‌పీఎల్ సంస్థ నుంచి కొనుగోలు చేసిన మీటర్లే. గ్రేటర్ జిల్లాల్లో 11 సర్కిళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 60 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో 53 లక్షల వరకు గృహ, 8 లక్షలకుపైగా వాణిజ్య, 50 వేలకు పైగా పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఒక్కో సర్కిల్ పరిధిలో నెలకు 5 వేల మీటర్లు స్టకప్ అవుతుంటే, 2500 నుంచి 4000 పైగా మీటర్లు కాలిపోతున్నాయి. 2023 అక్టోబర్ నుంచి 2024 మార్చి వరకు 1,19,432 మీటర్లు స్టకప్ కాగా, 27,722 మీటర్లు కాలిపోవడం గమనార్హం. సాంకేతిక సమస్యలు తలెత్తి పని చేయకుండా పోయిన ఈ విద్యుత్ మీటర్లలో చాలా వరకు ఓ ప్రముఖ కంపెనీవే ఉండటంతో ఆ కంపెనీ ఉత్పత్తుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అక్టోబర్ 2023 నుంచి 2024 మార్చి వరకు పాడైన మీటర్లు

సర్కిల్	మీటర్ స్టకప్	మీటర్ బర్న్
బంజారాహిల్స్	5977	935
సైబర్‌సిటీ	8992	4151
హబ్సిగూడ	11235	1747
హైదరాబాద్ సెంట్రల్	11896	2241
హైదరాబాద్ సౌత్	11015	3673
మేడ్చల్	18248	1595
రాజేంద్రనగర్	13869	4488
సరూర్‌నగర్	11892	1950
సికింద్రాబాద్	7789	612
వికారాబాద్	3583	2115
సంగారెడ్డి	14936	4215



ఆ కంపెనీ మీటర్లే అధికం

మీటరు కాలిపోవడానికి లూజ్ కాంటాక్ట్, షార్ట్ సర్క్యూట్, వర్షానికి తడిసిపోవడం ప్రధాన కారణమని డిస్కం పేర్కొంది. కానీ నిజానికి చాలా మీటర్లు నాణ్యత లోపం వల్లే కాలుతున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సమీపంలోని తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలు నాణ్యతకు పెద్ద పీట వేస్తున్నాయి. ధర కొంత ఎక్కువైనా నాణ్యమైన కంపెనీల నుంచి మీటర్లను కొనుగోలు చేసి వినియోగదారులకు అమర్చుతున్నాయి. కానీ మన డిస్కం మాత్రం ఇతర రాష్ట్రాలు నిరాకరించిన ఓ కంపెనీ మీటర్లను కొనుగోలు చేస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాణ్యతలేని మీటర్లను కొనుగోలు చేసి, బిగిస్తుండటం వల్ల అమర్చిన కొద్ది రోజులకే అవి పాడైపోతున్నట్లు సీనియర్ ఇంజనీర్లు అభిప్రాయపడుతున్నారు. ఒక వేళ మీటరు ఏదైనా సాంకేతిక లోపం తలెత్తితే దాన్ని రీప్లేస్ చేయాల్సిన బాధ్యత సదరు సంస్థపై ఉన్నా.. స్తంభించిన మీటర్లు మినహా వివిధ కారణాలతో కాలిపోయిన మీటర్లను రీ ప్లేస్ చేయడం లేదు.

పెన్షన్ల హామీ మర్చిపోవడం సిగ్గుచేటు



కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగిన నాయకులు

- వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

ఇబ్రహీంపట్నం రూరల్: ఆసరా పెన్షన్ పెంచుతామని ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య మండిపడ్డారు. ఆసరా పెన్షన్లు పెంచాలని కోరుతూ సోమవారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.6వేలు, బీడీ కార్మికులకు రూ.4వేలు పెంచుతామని అధికారంలోకి రాగానే మర్చిపోవడం సిగ్గుచేటన్నారు. ఏపీలో ప్రతీ నెల 1న ఇంటికి వెళ్లి పెన్షన్ ఇస్తుంటే ఇక్కడ మాత్రం 30వ తేదీ వచ్చినా ఇవ్వడం లేదని అన్నారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పెన్షన్లు పెంచే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈనెల 26న నిర్వహించ తలపెట్టిన ×చలో హైదరాబాద్‌×ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య, గువ్వల యాదయ్య, బాలరాజ్, రాములు, పల్స శంకర్, జిల్లా నాయకులు చాకలి ఉపేందర్, డేరంగుల ఈశ్వర్, పల్నాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు గ్రూప్-3 ప్రశాంతం



మొయినాబాద్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్



గురునానక్ కాలేజ్ వద్ద నోటీస్‌బోర్డుపై నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

మొయినాబాద్: గ్రూప్-3 పరీక్ష రెండో రోజు సోమవారం ప్రశాంతంగా జరిగింది. మండలంలో ఏర్పాటు చేసిన పది కేంద్రాల్లో అభ్యర్థులు పరీక్ష రాశారు. రెండో రోజు సైతం 25.1 శాతం మంది మాత్రమే హాజరయ్యారు. మొత్తం 5,718 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 1,439 మంది మాత్రమే హాజరయ్యారు. 4,279 మంది హాజరు కాలేదు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా తహసీల్దార్ గౌతమ్‌కుమార్ పర్యవేక్షించారు.

ఇబ్రహీంపట్నం పరిధిలో..

ఇబ్రహీంపట్నం: గ్రూప్-3 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. ఇబ్రహీంపట్నం పరిధిలో 11 కళాశాలల్లో 13,388 మంది అభ్యర్థులు గ్రూప్-3 పరీక్షలు రాసేందుకు 20 కేంద్రాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. మొదటి రోజు ఆదివారం ఉదయం, మధ్యాహ్నం జరిగిన రెండు పేపర్లకు 50.3 శాతం మంది అభ్యర్థులు హాజరు కాగా ఒకే పేపర్ ఉన్న రెండో రోజు సోమవారం పరీక్షకు 49.6 శాతం మాత్రమే హాజరయ్యారు. 50 శాతానికిపైగా అభ్యర్థులు ఈ పరీక్షకు దుమ్మా కొట్టారు. తొలిరోజు 6,735 మంది, మరుసటి రోజు 6,651 మంది మాత్రమే హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగేందుకు ఇటు పోలీసులు, అటు అధికారులు శ్రమించారు.

మృత్యువులోనూ వీడని స్నేహబంధం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం



తుప్పరి రాజు (ఫైల్)



సిద్ధిగారి మహేశ్ (ఫైల్)

కడ్తాల్: రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు ఇద్దరు స్నేహితుల ప్రాణాలను బలితీసుకుంది. ఆదివారం అర్ధరాత్రి మండల కేంద్రం సమీపంలోని టోల్‌గేట్ సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన సంఘటనలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు మిత్రులు మృతి చెందారు. సీఐ శివప్రసాద్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తుప్పరి రాజు (24), సిద్ధిగారి మహేశ్ (24) చిన్న నాటి నుంచి స్నేహితులు. ప్రైవేట్‌లో ఉద్యోగాలు చేస్తూ కలిసి మెలసి ఉండేవారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన ఓ ఫంక్షన్‌కు ఇద్దరూ కలిసి బైక్‌పై వెళ్లారు. ఫంక్షన్ ముగిసిన తర్వాత మిత్రులిద్దరూ అదే రాత్రి ఒంటి గంట సమయంలో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో కడ్తాల్ టోల్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపై ఎలాంటి ఇండికేటర్స్ లేకుండా లారీని డ్రైవర్ అజాగ్రత్తగా నిలిపి ఉంచాడు. చీకట్లో ఆగి ఉన్న లారీ సరిగ్గా కనిపించకపోవడంతో బైక్ నడుపుతున్న తుప్పరి రాజు వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మిత్రులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజు సోదరుడు తుప్పరి మహేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరు యువకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కాగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్ సోమవారం ఉదయం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆలయంలో చోరీ చేసిన వ్యక్తికి రిమాండ్

మీర్‌పేట: ఆలయంలో దేవతామూర్తుల విగ్రహాలను దొంగిలించిన వ్యక్తిని మీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రూ.2 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం. అల్మాస్‌గూడ లక్ష్మీనగర్ కాలనీకి చెందిన వడ్ల శ్రీనివాస్ (39) హోటల్‌లో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. చెడు వ్యసనాలకు బానిస కావడంతో పాటు వచ్చే డబ్బులు కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో టీచర్స్‌కాలనీలో నిర్మాణంలో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో పూజ నిమిత్తం అయ్యప్పస్వాములు తెచ్చిన గణపతి, అయ్యప్పస్వామి, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను శనివారం అర్ధరాత్రి దొంగిలించాడు. ఈ మేరకు పోలీసులు సీసీటీవీ ఫుటేజీ ద్వారా నిందితున్ని సోమవారం అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి ఒక ద్విచక్ర వాహనం, విగ్రహాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

వేడుకకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం

ఇద్దరి దుర్మరణం



యాదగిరి, యాదయ్య మృతదేహాలు

ఆమనగల్లు: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందారు. ఆమనగల్లు ఎస్ఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. ఆమనగల్లు మండలం మంగళపల్లి పరిధిలోని చెన్నకేశవ కాలనీకి చెందిన వరికుప్పల యాదగిరి (45), మర్ల యాదయ్య (42) సోమవారం రాత్రి చుక్కాపూర్ సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో బంధువుల వేడుకకు హాజరు కావడానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. చింతలపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మత్తి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్వస్తిక్ సంస్థలపై ఐటీ దాడులు

- మార్కెట్ విలువను ఎక్కువ చూపి భూములు అమ్మడంపై తనిఖీలు
- కంపెనీ లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు



ఎలికట్ట శివారులోని స్వస్తిక్ పరిశ్రమ లోనికి వెళ్తున్న అధికారుల వాహనం



పరిశ్రమలోనికి వెళ్తున్న అధికారులు

షాద్‌నగర్ రూరల్: షాద్‌నగర్ పరిధిలో పలుచోట్ల ఇన్‌కమ్ టాక్స్ (ఐటీ) అధికారులు ఏక కాలంలో దాడులు చేపట్టారు. ఎలికట్ట, రంగంపల్లి గ్రామ పంచాయతీ శివారులోని స్వస్తిక్ సంస్థలపై సోమవారం ఇన్‌కంటాక్స్ (ఐటీ) అధికారుల బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. తెల్లవారుజామునుంచే అధికారులు ఎలికట్ట శివారులోని స్వస్తిక్ మిర్చి పరిశ్రమ, ఎలైట్ (ఫ్లైవుడ్) పరిశ్రమ, రంగంపల్లి శివారులోని ఫోర్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలతో పాటు పట్టణంలోని ఇద్దరు వ్యాపారవేత్తల ఇళ్లలో ఏక కాలంలో సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేయడంతో పాటు లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించిటన్లు తెలుస్తోంది. స్వస్తిక్ పరిశ్రమల్లో తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు సోదాలు కొనసాగాయి.

భూముల అమ్మకాల నేపథ్యంలో..

షాద్‌నగర్ ప్రాంతంలోని ఎలికట్ట పరిశ్రమల కారిడార్‌లో స్వస్తిక్ పరిశ్రమ, ఫోర్ ఆగ్రో పరిశ్రమ యజమానులకు ఎలికట్టతో పాటు ఇతర ప్రాంతాల్లో కోట్ల రూపాయల విలువ చేసే భూములు ఉన్నాయి. స్వస్తిక్ పరిశ్రమ నిర్వాహకులు అదే పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. స్వస్తిక్ రియల్ ఎస్టేట్ పేరుతో భూముల అమ్మకం, కొనుగోళ్లు చేపడుతున్నారు. ఇటీవల షాద్‌నగర్ ప్రాంతంలో దాదాపు రూ.300 కోట్ల విలువ చేసే భూములను అమ్మినట్లు తెలుస్తోంది. వీటికి సంబంధించి మార్కెట్ విలువను ఎక్కువగా చూపి, ఓ కంపెనీకి విక్రయించినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఐటీ అధికారులు భూములు కొనుగోలు చేసిన కంపెనీ వారు ఇచ్చిన చెక్కులను విత్‌డ్రా చేయొద్దని స్వస్తిక్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ఇందుకు సరైన సమాధానం ఇవ్వకుండానే, స్వస్తిక్ కంపెనీ వారు చెక్కులను డ్రా చేసుకున్నట్లు సమాచారం. అనంతరం ఈ డబ్బు ఏయే ఖాతాలకు వెళ్లింది..? ఎవరికి ముట్టాయి.. అనే విషయాలపై ఐటీ అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగానే దాడులు నిర్వహించారు.

ఇద్దరు స్థానిక వ్యాపారుల ఇళ్లలోనూ..

షాద్‌నగర్ ప్రాంతంలోని స్వస్తిక్ సంస్థలపై తనిఖీలు చేపట్టిన ఐటీ అధికారులు పట్టణానికి చెందిన ఇద్దరు ప్రముఖ వ్యాపారవేత్తల ఇళ్లలో తనిఖీలు చేశారు. రియల్ వ్యాపారి ఇంట్లో, ఫైనాన్స్ వ్యాపారి కార్యాలయంలో ఏక కాలంలో సోదాలు నిర్వహించారు. రియల్ వ్యాపారి ఇంట్లోని రికార్డులు, ఫైనాన్స్‌లోని రికార్డులను పరిశీలించి రికార్డులు తీసుకెళ్లినట్లు తెలిసింది. పట్టణానికి చెందిన సదరు రియల్ వ్యాపారి షాద్‌నగర్ ప్రాంతంలోని ఎలికట్ట శివారులో భూమిని గతంలో స్వస్తిక్ రియట్ ఎస్టేట్ గ్రూపునకు అమ్మినట్లు సమాచారం. కాగా, కొత్తూరు మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన జోజిరెడ్డి ఇల్లు, కార్యాలయంలోనూ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. సదరు వ్యక్తి రియల్ వ్యాపారంతో పాటు లేబర్ కాంట్రాక్టర్‌గా వ్యాపారం చేస్తున్నాడు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

వైభవంగా మైసిగండి ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు



శతచండీ హోమ పూజలు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండిలో మైసమ్మ తల్లి జాతర ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం నాలుగో రోజు ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ శిరోలీ, ఆలయ ఈవో స్నేహలత, ఆలయ నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, తహసీల్దార్ జ్యోతి, పీసీసీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, వెంకన్న, భక్తులు పాల్గొన్నారు.

జంట హత్యలపై ఏసీపీ ఆరా



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ రాజు

మాడ్గుల: మండల పరిధిలో నాగిళ్ల గ్రామంలో ఆదివారం రాత్రి జంట హత్యలు కలకలం రేపిన సంగతి తెలిసిందే. సంఘటనా స్థలాన్ని సోమవారం ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆదివారం రాత్రి పరస్పర దాడిలో బావబావమరుదులు బర్కం యాదయ్య(54), గడ్డం శ్రీను (40) మృతి చెందిన విషయం విధితమే. మాజీ సర్పంచ్ రామేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా బ్లాస్టింగ్ : కేసు నమోదు

తలకొండపల్లి: అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ చేసిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని వెంకటాపూర్ తండా శివారు ప్రాంతంలోని రామ్ కే డెవలప్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ బృందావనం వెంచర్‌లో సోమవారం మూడు చోట్ల బ్లాస్టింగ్ చేపట్టారు. అనుమతి లేకుండా బ్లాస్టింగ్ చేపట్టిన సంబంధిత వ్యక్తులపై (నరేందర్, గోవింద్, మరి కొంత మంది) కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో టీచర్‌కు తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మంగ

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రత్యేక తరగతులకు హాజరయ్యేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి తీవ్ర గాయలయ్యాయి. ఈ సంఘటన నాగన్‌పల్లి సమీపంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తుర్కయంజాల్‌లో నివసించే మంగ జెడ్పీహెచ్‌ఎస్ నాగన్‌పల్లిలో హిందీ టీచర్‌గా పని చేస్తోంది. రోజుమాదిరిగానే సోమవారం ఉదయం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధించేందుకు ఉదయం 7 గంటలకు ఇంట్లో నుంచి ద్విచక్రవాహనంపై వెళ్లింది. 7.45 గంటలకు నాగన్‌పల్లి సమీపంలోని రోడ్డు మలుపు వద్ద వాహనం స్కిడ్ కావడంతో కిందపడిపోయింది. దీంతో తల, భుజం, పక్కటెముకలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మంగను పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వర్కాల పరమేష్, చంద్రశేఖర్ పరామర్శించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో సబ్ సెంటర్ వద్ద, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆమనగల్లు ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తాతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, మద్దతు ధర పొందాలని సూచించారు. సన్న వడ్లకు క్వింటాకు రూ.500 అదనంగా ప్రభుత్వం ప్రోత్సాహక బోనస్ అందిస్తోందని తెలిపారు. ధాన్యంలో తరుగు పేరుతో కోతలు లేకుండా చివరి గింజవరకు కొనుగోలు చేస్తామని భరోసా కల్పించారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి 48 గంటల్లోగా డబ్బులు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిన్నట్లు తెలిపారు. కొంత మంది చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు ధాన్యంలో తేమ శాతం ఉండేలా చూసుకోవాలని సూచించారు. రైతులకు అండగా ఉంటామని, ఏ చిన్న సమస్య తలెత్తిన తక్షణమే స్పందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, పీసీసీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ సత్యం, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, వేణుగోపాల్, శేఖర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్ నాయకులు ఉన్నారు.

డ్వాక్రా సంఘాల సొమ్ము స్వాహా!

- ఫోర్జరీ సంతకాలతో బ్యాంకు నుంచి నిధుల డ్రా
- మల్కీజ్‌గూడ డ్వాక్రా మహిళల ఫిర్యాదు
- విచారణ చేపట్టిన అధికారులు
- రూ.20 లక్షల మేర కాజేసినట్టు గుర్తింపు

యాచారం: నకిలీ తీర్మానాలు.. ఫోర్జరీ సంతకాలు చేసి ఓ వీబీకే (విలేజ్ బుక్ కీపర్) ఎస్‌బీఐకి కన్నం పెట్టింది. డ్వాక్రా సంఘాల మహిళలు ప్రతి నెలా చెల్లించే రికవరీ చెల్లింపుల్లో తేడా రావడం గుర్తించి బ్యాంకు మేనేజర్ సెర్ప్ ఏపీఎంకు ఫిర్యాదు చేశారు. డ్వాక్రా సంఘాల మహిళల ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ చేపట్టగా ఓ వీబీకే రూ.లక్షలాది నిధులు స్వాహా చేసినట్లు వెలుగులోకి వచ్చింది. వివరాలివీ.. మండల పరిధిలోని మల్కీజ్‌గూడలో 45 గ్రామ సంఘాలు ఉన్నాయి. ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు విలేజ్ బుక్ కీపర్‌గా గ్రామానికి చెందిన వరికుప్పల రాణి విధులు నిర్వర్తిస్తోంది. డ్వాక్రా సంఘాల మహిళల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న ఆమె గతేడాది అక్టోబర్ నుంచి నకిలీ తీర్మానాలు, స్టాంపులతో ఫోర్జరీ సంతకాలు చేసి యాచారం ఎస్‌బీఐలో పలు తేదీల్లో రూ.20 లక్షల వరకు వివిధ గ్రామాలకు చెందిన మహిళల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయించింది. అనుమానం వచ్చిన గులాబీ, ఇందిర తదితర గ్రూపులకు చెందిన మహిళలు కొద్ది రోజుల క్రితం యాచారం ఎస్‌బీఐ మేనేజర్ జాన్సీని కలిసి నిధుల డ్రాను పరిశీలించాలని కోరారు. వారి ఫిర్యాదు మేరకు రికార్డులను పరిశీలించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

నిధుల దుర్వినియోగంపై విచారణ

నిధుల బదిలీపై సోమవారం మల్కీజ్‌గూడలో అధికారులు విచారణ చేపట్టారు. ఎస్‌బీఐ మేనేజర్ జాన్సీ, సెర్ప్ ఏపీఎం సుదర్శన్‌రెడ్డి తదితరులు స్థానిక డ్వాక్రా సంఘం భవనంలో గ్రామంలోని డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశమయ్యారు. గ్రామంలో ఉన్న 45 గ్రూపుల్లో రెండు మూడేళ్లుగా తీసుకున్న రుణాలు, చెల్లిస్తున్న రికవరీపై రికార్డులు తనిఖీ చేశారు. అదే సమయంలో గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో డ్వాక్రా సంఘం భవనం వద్దకు చేరుకున్నారు. వీబీకే వరికుప్పల రాణిని పిలిపించాలని డిమాండ్ చేశారు. సెర్ప్ అధికారులు, బ్యాంకు మేనేజర్‌తో వాగ్వాదానికి దిగారు. ఒక వీబీకే ఫోర్జరీ సంతకాలు, నకిలీ రికార్డులు సృష్టించి రూ.లక్షలాది నిధులు ఇతర మహిళల ఖాతాల్లోకి బదిలీ చేయిస్తుంటే ఏం పర్యవేక్షణ చేస్తున్నారని మండిపడ్డారు. వీబీకే స్వాహా చేసిన నిధులను తిరిగి చెల్లించే విధంగా కృషి చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించారు.



నిధుల స్వాహాపై విచారణ చేపట్టిన అధికారులు

నిద్రమత్తులో కింద పడి యువకుడి మృతి



రాజు (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: నిద్రమత్తులో ఇంటిపై కప్పు నుంచి పడి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని రావిర్యాలకు చెందిన గుంటి రాజు (27) ఆగఖాన్ అకాడమీలో బాల్‌బాయ్‌గా పని చేస్తుండేవాడు. ప్రతి రోజు ఇంటిపై నిద్రిస్తాడు. ఆదివారం రాత్రి ఇంటిపై పడుకొని ఉండగా అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కిందపడినట్లు పెద్ద శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు గమనించారు. తీవ్ర గాయాలతో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లింట్లో భారీ చోరీ

133 తులాల బంగారం, 80తులాల వెండి, రూ.2.5లక్షల నగదు అపహరణ



వివరాలు అడిగి తెలుసుకుంటున్న నార్సింగి ఏసీపీ రమణగౌడ్

శంకర్‌పల్లి: పట్టణంలోని ఓ పెళ్లి ఇంట్లో ఆదివారం రాత్రి భారీ దొంగతనం జరిగింది. పెళ్లివారంతా హల్దీ వేడుకలో ఉండగా.. దుండగులు తమ పని తాము చేసుకొని వెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదుతో శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ సత్యనారాయణ వెంటనే పెళ్లింటికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న నార్సింగి ఏసీపీ రమణగౌడ్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శంకర్‌పల్లి సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన పార్శి బాలకృష్ణ వ్యాపారవేత్త, రాజకీయ నాయకుడు. తన కూతురు వివాహం ఈనెల 20న ఉండడంతో ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఇంటి బయట హల్దీ ఫంక్షన్ ఏర్పాటు చేసుకున్నారు. కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు వేడుక కోసం బయట ఉన్నారు. రాత్రి 11గంటల సమయంలో ఇంట్లోకి వెళ్లి.. వేసుకున్న నగలు పెడదామని చూసే సరికి లాకర్ తెరిచి ఉంది. అనుమానం వచ్చి మొత్తం పరిశీలించగా 133 తులాల బంగారం (17 ఆభరణాలు), 80 తులాల వెండి, రూ.రెండున్నర లక్షల నగదు కనిపించలేదు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్స్‌టీం, రాజేంద్రనగర్ సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేస్తున్నారు.